www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH | TELUGU | HINDI DAILY

ఆదివారం, 14-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :45 Issue : 45 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## తుని ప్రాంతంలో చిన్నారి అదృశ్యం ఘటనపై శ్రీ పవన్ కళ్యాణ్ ఆరా

- కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రివర్యులు
- ఆచూకీ కనిపెట్టేందుకు చేపట్టిన చర్యలపై చర్చ



కాకినాడ జిల్లా, తుని మండల పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ త్వరితగతిన కనుగొనేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రస్తుతం గాలింపు చర్యల్లో పాల్గొంటున్న పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు కూడా వినిగియోగించుకోవాలని తెలిపారు. దట్టమైన అడవుల్లోకి సైతం వెళ్లగలిగే అటవీశాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంప్ వాచర్స్, ఎక్స్ పర్ట్స్ సహాయం తీసుకుని పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని చెప్పారు. చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటనపై శనివారం మరోసారి కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్ లో సమీక్షించారు. ఇప్పటికే పలుమార్లు ఈ అంశంపై పోలీసు ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. బాలిక ఆచూకి కనుగొనేందుకు ఇప్పటికే 400 మందికిపైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నట్టు, అత్యాధునిక డ్రోన్లతో అణువణువు జల్లెడ పడుతున్నట్టు కాకినాడ ఎస్పీ వివరించారు. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించినట్టు తెలిపారు. చిన్నారి అదృశ్యమై వారం రోజులు గడచిన క్రమంలో దర్యాప్తు మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ ఆదేశించారు.



## మహిళా వారోత్సవాలు విజయవంతం

- ఆర్థిక స్వావలంబన నుంచి రాజకీయ నాయకత్వం వరకు..
- మహిళా సాధికారతకు కొత్త దిశ

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వి అప్డేట్స్:** మహిళలను సంక్షేమ పథకాల లబ్దిదారులుగా కాక రాష్ట్ర అభివృద్ధికి చోదక శక్తులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహించిన మహిళా వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుంచి 31 వరకు నిర్వహించిన ఈ వారోత్సవాలు మహిళల ఆర్థిక, సామాజిక, విద్య, ఆరోగ్య, రాజకీయ సాధికారతకు కొత్త ఊపునిచ్చాయి. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం

మిగతా 3వ పేజీలో..

## హైదరాబాద్‌లో భారీ వర్షం

- అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం

3



అధికార యంత్రాంగానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

3

## ఓట్లు తొలగించే కుట్ర జరుగుతుంది



**రాజన్న సిరిసిల్ల,జూన్13:** రాష్ట్రంలో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. 'సర్' ప్రక్రియను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లాగా దొంగ ఓట్లతో గెలవాలని తాము అనుకోమని తేల్చిచెప్పారు. రైతు భరోసా వేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతన్నలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. 'సర్' పేరుతో అసలైన ఓట్లను తొలగిస్తే ఊరుకోమని కేటీఆర్ హెచ్చరించారు.

## జీహెచ్ఎంసీ ఎన్నికలపై కమలం అప్రమత్తం

- ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా వస్తుందనే అంచనా
- రిజర్వేషన్ల ప్రకటనతోనే అభ్యర్థుల ఖరారుకు కసరత్తు
- డివిజన్ల వారీగా సర్వేలు.. బూత్ స్థాయి విశ్లేషణ
- చివరి నిమిషం ఇబ్బందులు తప్పించుకోవడమే లక్ష్యం
- కిషన్ రెడ్డి పర్యవేక్షణలో వ్యూహాలకు పదును

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వి అప్డేట్స్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై స్పష్టత లేకపోయినా, ఎన్నికల సమరానికి తెలంగాణ బీజేపీ ముందస్తుగా సిద్ధమవుతోంది. జీహెచ్ఎంసీతో పాటు గ్రేటర్ పరిధిలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతున్న వేళ కమలం పార్టీ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఎన్నికలు వెంటనే జరుగుతాయని కొందరు అంచనా వేస్తుండగా, ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్రియ పూర్తయిన తర్వాతే నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని మరికొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఒకసారి ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటే చాలా తక్కువ వ్యవధిలోనే నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని బీజేపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్ల అంశాలపై ముందస్తు అవగాహన ఉండే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. అదే సమయంలో రిజర్వేషన్ల ప్రకటన తర్వాత వెంటనే ఎన్నికలకు వెళితే అభ్యర్థుల ఎంపికలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

మిగతా 2వ పేజీలో..

## సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి

- కోల్ బ్లాకుల వేలంలో పాల్గొనకుండా నిర్వీర్యం
- డేగల్ని, దళారుల్ని అడుగుపెట్టనివ్వం
- సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- 335 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేత

**మంచిర్యాల, జూన్ 13, ఆశ్వి అప్డేట్స్ :** సింగరేణిని బతికించుకుంటాం.. కార్మికులను రక్షించుకుంటాం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాలలో సంస్థలో 335 మందికి కారుణ్య నియామక పత్రాలు

మిగతా 3వ పేజీలో..





### బీజేపీ కుట్రలకు మీనాక్షి బలి

- కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ : మహేశ్ కుమార్

2



### అవకతవకల వార్తలు పరిశీలించి చర్యలు తీసుకోండి

- సింగరేణిపై దృష్టి పెట్టండి
- ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

2

## హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'లో మంత్రి శ్రీధర్ బాబు

3




## కవిత పార్టీ పేరుకు ఈసీ వద్ద వందల అభ్యంతరాలు



2

- కవిత పార్టీ పేరుకు ఈసీ వద్ద వందల అభ్యంతరాలు
- టీఆర్ఎస్ పేరుపై మహారాష్ట్ర సంస్థలూ హక్కు
- తెలంగాణ సెంటిమెంట్‌తో ముడిపడి ఉందంటూ బీఆర్ఎస్ ఫిర్యాదు
- ఎన్నికల సంఘం నిర్ణయంపై రాజకీయ వర్గాల దృష్టి
- తెలంగాణ రక్షణ సేన పేరుపై కొనసాగుతున్న చర్చ



### షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీస్

- మహిళలను కించపరిచేలా వ్యాఖ్యల వ్యవహారంలో

3

## దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్

- క్యాడెట్లకు అభినందనలు తెలిపిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో దేశ రక్షణకు సిద్ధంగా ఉండాలని పిలుపు
- నారీశక్తికి నిదర్శనంగా మహిళా క్యాడెట్లను ప్రశంసించిన రాజ్‌నాథ్

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వి అప్డేట్స్:** హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. భారత వైమానిక దళంలో చేరబోతున్న యువ అధికారులకు అభినందనలు

మిగతా 2వ పేజీలో..





### ఫోన్ ట్యాపింగ్.. మంత్రి తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వి అప్డేట్స్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. గతంలో ట్యాపింగ్‌కు గురైన వాటిలో మంత్రి

మిగతా 2వ పేజీలో..

# దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్

**మొదటిపేజీ తరువాయి**



తెలియజేస్తూ దేశ రక్షణలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 245 మంది క్యాడెట్లకు రాజ్‌నాథ్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. వియత్నాంకు చెందిన విదేశీ క్యాడెట్లను కూడా ప్రత్యేకంగా అభినందించారు. భారత ఎయిర్‌ఫోర్స్ అకాడమీ విదేశీ విద్యార్థులకు సైతం శిక్షణ అందించడం దేశానికి గర్వకారణమని ఆయన అన్నారు.

**ఎయిర్‌ఫోర్స్ చరిత్ర స్ఫూర్తిదాయకం**

భారత వైమానిక దళం చరిత్రను ప్రస్తావిస్తూ 194748లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఎయిర్‌ఫోర్స్ కీలక పాత్ర పోషించిందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. అలాగే 1971 యుద్ధంలో కేవలం 13 రోజుల్లోనే విజయాన్ని సాధించడంలో భారత వైమానిక దళం పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. అలాంటి ఘనమైన చరిత్ర కలిగిన దళంలో మీరు అడుగు పెడుతున్నారని క్యాడెట్లకు చెప్పారు.

**ఆధునిక యుద్ధాలకు సిద్ధంగా ఉండాలి**

ప్రస్తుతం యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక ఆయుధాలు, రాడార్లకు చిక్కకుండా దాడులు చేసే వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో క్షణాల్లో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం సైనికాధికారులకు ఎంతో అవసరమని చెప్పారు. సరికొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని యువ అధికారులకు సూచించారు.

**ఆపరేషన్ సిందూర్ ఆదర్శం కావాలి**

ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత వైమానిక దళం ప్రదర్శించిన ధైర్యసాహసాలు, తెగువను ఆదర్శంగా తీసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా సమర్థంగా పనిచేసే స్ఫూర్తిని అలవరుచుకోవాలని సూచించారు.

**మహిళల పాత్ర మరింత బలపడుతోంది**

భారత ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కేవలం సైనిక శిక్షణకే పరిమితం కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విదేశాలకు పరిచయం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. విదేశీ క్యాడెట్లకు శిక్షణ ఇవ్వడం ద్వారా భారతదేశ ప్రతిష్ఠ మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా భారత వైమానిక దళంలో కమిషన్ పొందబోతున్న మహిళా క్యాడెట్లను రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఎయిర్‌ఫోర్స్‌లో వారి ప్రవేశం నారీశక్తికి నిదర్శనమని కొనియాడారు. దేశ రక్షణలో మహిళల భాగస్వామ్యం మరింత బలపడుతోందని అన్నారు.

క్యాడెట్లందరూ తమ శిక్షణను దేశ సేవకు అంకితం చేసి భారత వైమానిక దళం గొప్ప సంప్రదాయాలను కొనసాగించాలని రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైమానిక దళ ఉన్నతాధికారులు, క్యాడెట్ల కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

---

# ఫోన్ ట్యాపింగ్.. మంత్రి తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

**మొదటిపేజీ తరువాయి**

తుమ్మల నాగేశ్వరరావు నంబర్ కూడా ఉండటంతో ఆయన స్టేట్‌మెంట్‌ను ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు చేస్తున్న 'సిట్' శనివారం రికార్డు చేసింది. 2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు తెలిపారు. మంత్రి ఇంటికి వెళ్లి ఆయన వినియోగించిన నంబర్ చూపి వివరాలు, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.

**సిట్ విచారణకు ఎంపీ అనిల్ కుమార్ హాజరు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను 'సిట్' జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో శనివారం సుదీర్ఘంగా విచారించింది. గత ప్రభుత్వ హయాంలో అనిల్ కుమార్ యాదవ్ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు గుర్తించిన పోలీసులు ఇందుకు సంబంధించిన కొన్ని సాంకేతిక ఆధారాలను ఆయన ముందు ఉంచి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఏయే రోజుల్లో, ఏ సమయాల్లో ఫోన్ కాల్స్ ట్యాప్ చేశారనే వివరాలను అధికారులు ఆయనకు వివరించినట్లు తెలిసింది. ఇదే కేసులో అనిల్ తండ్రి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు సిట్ నిర్ధారించింది. అయితే ఆయన వయోభారం, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా నేరుగా వారి ఇంటికే వెళ్లి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. విచారణ అనంతరం ఎంపీ అనిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ట్యాపింగ్ వ్యవహారంపై బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'బీఆర్ఎస్ పార్టీ అత్యంత నీచ రాజకీయాలకు పాల్పడింది.. నా ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు గుర్తించి నన్ను విచారణకు పిలిచారు. .ఏ రోజు, ఏ టైమ్‌కు ట్యాపింగ్ జరిగిందో కొన్ని కీలక ఆధారాలను నా ముందు ఉంచి వివరాలు అడిగారు.. అప్పట్లో మా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల ప్రకారం పార్టీ కార్యక్రమాలను నిర్వహించేవాళ్లం. అయితే ఏదైనా కార్యక్రమం తలపెట్టి గడప దాటక ముందే తమ ఇంటి ముందు పోలీసులు వాలిపోయేవారు.. మాకు అప్పట్లో అర్థం కాలేదు.. ప్లాన్ చేసుకున్న విషయాలు పోలీసులకు ఎలా తెలుస్తున్నాయా అని ఆశ్చర్యపోయేవాళ్లం. ఇప్పుడు 'సిట్' ఆధారాలు చూపిస్తుంటే అసలు విషయం అర్థమైంది' అని చెప్పారు. తన తండ్రి అంజన్ కుమార్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని మండిపడ్డారు. ఆయన స్టేట్‌మెంట్ తీసుకోవడానికి అధికారులు ఇంటికి వస్తామని చెప్పారని వెల్లడించారు.

---

# నలుగురు మావోయిస్టులకు బెయిల్

- **షరతులతో విడుదలకు కృష్ణా జిల్లా కోర్టు అనుమతి**

**విజయవాడ, జూన్ 13, ఆశ్వ అప్డేట్స్:**

మావోయిస్టు కార్యకలాపాల కేసులో అరెస్టైన నలుగురు మావోయిస్టులకు కృష్ణా జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పోడియం రెండు అలియాస్ భీమ, మదకం మదన్ అలియాస్ మాదనన్న, సోది మనీలా, సోది మంగిలకు బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి నిందితుడు రూ.25 వేల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఇద్దరు పూచీకత్తుదారులను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. వారిలో ఒకరు స్థానిక పూచీకత్తుదారు అయి ఉండాలని స్పష్టం చేసింది. అలాగే కోర్టు అనుమతి లేకుండా విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిని దాటి వెళ్లరాదని షరతు విధించింది.

**కానూరులో అరెస్టు**

గత ఏడాది నవంబర్ 18న విజయవాడ కానూరు ఆటోనగర్ ప్రాంతంలో పక్కా సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఓ భవనంలో ఉన్న ఈ నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో నిందితులు 200 రోజులకు పైగా నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. దర్యాప్తు గడువు, చట్టపరమైన అంశాలను ప్రస్తావిస్తూ డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని వారి తరపు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు.

**వాదనల అనంతరం ఉత్తర్వులు**

ఈ నెల 2న ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. అనంతరం కేసును పరిశీలించిన ధర్మాసనం నిందితుల తరపు వాదనలతో ఏకీభవించింది. ఈ మేరకు నలుగురు మావోయిస్టులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

---

# అవకతవకల వార్తలు పరిశీలించి చర్యలు తీసుకోండి

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వ అప్డేట్స్ :**

సింగరేణి సంస్థలో అవకతవకలు, అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ ఇటీవల మీడియాలో కొన్ని కథనాలు, వార్తలు ప్రచురితమయ్యాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకొచ్చారు. ఈమేరకు ఆయన ఒక లేఖ రాశారు. అందులోని వివరాలు ఇలా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నడుస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీకి సంబంధించిన ఒక ముఖ్యమైన అంశాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సింగరేణి కీలకమైనది. దేశంలోని బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి గణనీయమైన పాత్ర పోషిస్తూ దేశ ఇంధన భద్రతకూ విశేషంగా దోహదపడుతోంది. ఇలాంటి సంస్థ నిరంతర అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం అనేవి అత్యంత ప్రాధాన్యమైన అంశాలు. ఈ సందర్భంలో ఇలాంటి అవకతవకలు, అక్రమాలకు సంబంధించిన వార్తల్లోని నిజానిజాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోకపోతే సింగరేణి ప్రయోజనాలకు విఘాతం కలిగే అవకాశం ఉంది. దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు అదృశ్యమైందని, దీనివల్ల సంస్థకు గణనీయమైన ఆర్థిక నష్టం సంభవించినట్లు ఈ పత్రికల కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.51,500 కోట్లకు పైగా బకాయిల కారణంగా సింగరేణి ఆర్థికంగా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ఇలాంటి వార్తలు సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని మరింతగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. వీటిని తక్షణమే పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టకపోతే సింగరేణి ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడటమేకాక సంస్థ భవిష్యత్ అభివృద్ధి, స్థిరత్వానికి కూడా ఆటంకం కలగవచ్చు.. అందువల్ల వాస్తవాలను పరిశీలించి ఆరోపణల్లోని నిజానిజాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నాను. అలాగే సింగరేణి సమర్థవంతమైన నిర్వహణ కోసం తగిన సేఫ్ గార్డ్స్, మెకానిజం, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ సరిగ్గా అమలవుతోందా అనే అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది.. ఈ సమీక్షలో టెక్నాలజీ బేస్డ్ మానిటరింగ్ టూల్స్ వినియోగించడం అవసరమని భావిస్తున్నాను.. అలాగే సమయానుగుణంగా సమీక్షలను నిర్వహించడం ద్వారా లోపాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే వెంటనే పరిష్కరించేందుకు వీలవుతుంది. ఈ ప్రయత్నం ద్వారా వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను తొలగించడమే కాక భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా నిరోధించడంతోపాటు సంస్థ సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను మరింత బలోపేతం అవుతుంది.. సంస్థ సజావుగా పనిచేయడంలో సంస్థ కోసం ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం విషయంలోనూ మీరు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుతున్నాను

---

# గూడెం ఆలయానికి రూ.70 కోట్లతో మహా అభివృద్ధి

- **హామీ ఇచ్చిన 37 రోజుల్లోనే నిధుల మంజూరు**
- **దేవాలయాల అభివృద్ధికి రూ.2,216 కోట్లు ఖర్చు**
- **గోదావరి పుష్కరాలకు రూ.802 కోట్ల కేటాయింపు**
- **రైతులకు అండగా గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు**

**మంచిర్యాల, జూన్ 13, ఆశ్వ అప్డేట్స్:**



దైవభక్తితో పాటు సమాజంలో మార్పు కోసం విద్య, రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయనతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పులు సాధ్యమవుతాయని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. గతంలో జరిగిన పిప్పిరి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

ఆ హామీ ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు విడుదల చేసి భూమిపూజ నిర్వహించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ.70 కోట్ల వ్యయంతో అత్యంత ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

రాష్ట్రంలో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటివరకు వివిధ దేవాలయాల అభివృద్ధికి రూ.2,216 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల సరస్వతీ పుష్కరాలను వైభవంగా నిర్వహించామని, రాబోయే గోదావరి పుష్కరాల కోసం రూ.802 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

దేవాలయాల అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం సమానంగా పరిగణిస్తోందన్నారు. గూడెం ప్రాంత రైతులకు సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు రూ.74 కోట్లతో గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక రైతులకు సాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మికాభివృద్ధి, రైతు సంక్షేమం, విద్యాభివృద్ధి అనే మూడు ప్రధాన లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# జీహెచ్ఎంసీ ఎన్నికలపై కమలం అప్రమత్తం

**మొదటిపేజీ తరువాయి**

గత మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ముందుగానే కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. డివిజన్లవారీగా ఓటర్ల వివరాలు, బూత్‌ల స్థాయిలో పార్టీ బలాబలాలు, గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతంపై విశ్లేషణ జరుగుతోంది.

పార్టీ కోసం పనిచేస్తున్న సర్వే సంస్థలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో విస్తృతంగా సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం. రిజర్వేషన్లు ఏ వర్గానికి వచ్చినా వెంటనే అభ్యర్థిని ప్రకటించేలా వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకుల వివరాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్త డివిజన్లపై ప్రత్యేక దృష్టి సారించిన బీజేపీ, స్థానిక నాయకత్వ బలాబలాలు, ప్రజాభిప్రాయం, పార్టీ ప్రభావం వంటి అంశాలపై నివేదికలు రూపొందిస్తోంది. సర్వే ఫలితాల ఆధారంగానే టికెట్ల కేటాయింపు ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గ్రేటర్ ఎన్నికల సన్నాహకాలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఇటీవల గ్రేటర్ పరిధిలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో ఎన్నికల వ్యూహాలపై చర్చించినట్లు తెలిసింది.

సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తం మీద ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత లేకపోయినా, చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో బీజేపీ గ్రేటర్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

---

# బీజేపీ కుట్రలకు మీనాక్షి బలి

**హైదరాబాద్, జూన్ 13 , ఆశ్వ అప్డేట్స్:**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు వేసిన నామినేషన్ తిరస్కరణ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేక నియంత దేశంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం ఇక్కడ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ నటరాజన్‌పై కేసు ఏమీ లేదని, నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బీజేపీ కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి కార్యాలయం కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. 24 గంటల్లో ఎన్నికల కమిషన్ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. మీనాక్షిని బలి చేశారని, ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని, అంతమాత్రాన కుట్రకు పాల్పడరాదని అన్నారు. ఓటు చోరీ చేసి ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు.

---

# నా ఆస్తులు దోచుకునేందుకు కుట్ర

- **కూటమి నేతలపై కేఏపాల్ సంచలన ఆరోపణలు**

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వ అప్డేట్స్:**

తన చారిటీ సంస్థకు చెందిన ఆస్తులను దోచుకునేందుకు కుట్ర జరుగుతోందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ ఆరోపించారు. తాను ప్రపంచ శాంతి కోసం పోరాడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ మాత్రం తన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

మీడియాతో మాట్లాడుతూ తాను ప్రజా సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని కేఏపాల్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాయాలని చూస్తున్నారని ఆరోపించారు. అయితే ఎలాంటి ఒత్తిళ్లకు తాను లొంగబోనని, అన్యాయానికి వ్యతిరేకంగా తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

2014 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ గెలుపు కోసం పగలు, రాత్రి తేడా లేకుండా ప్రచారం చేశానని కేఏపాల్ గుర్తు చేశారు. దేశ ప్రయోజనాల కోసం పనిచేసిన తనకు ఇప్పుడు న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

తన చారిటీ సంస్థ ఆస్తులకు సంబంధించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కేఏపాల్ కోరారు. ఆయన చేసిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

---

# కవిత పార్టీ పేరుకు ఈసీ వద్ద వందల అభ్యంతరాలు

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వ అప్డేట్స్:**

తెలంగాణ రాజకీయాల్లో కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పార్టీ పేరులో టీఆర్ఎస్ అనే సంక్షిప్త రూపాన్ని వినియోగించడంపై వివాదం చెలరేగడంతో ఆ టైటిల్ కొనసాగుతుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల సంఘం వద్ద పెద్ద ఎత్తున అభ్యంతరాలు నమోదవడంతో ఈ అంశం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కొత్త రాజకీయ పార్టీ నమోదులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలు స్వీకరించేందుకు బహిరంగ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటన అనంతరం తెలంగాణ రక్షణ సేన పేరుపై భారీ సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. సాధారణంగా కొత్త పార్టీల పేర్లపై పరిమిత సంఖ్యలోనే అభ్యంతరాలు వస్తుంటాయి. అయితే ఈ పార్టీ విషయంలో మాత్రం వందల సంఖ్యలో అభ్యంతరాలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కవిత పార్టీ ప్రకటనకు ముందే టీఆర్ఎస్ పేరును తాము కోరామని మహారాష్ట్రలోని షోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన ప్రతినిధులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ పేరును తమకే కేటాయించాలని వారు కోరినట్లు సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ కూడా ఈ అంశంపై ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో టీఆర్ఎస్ పేరు ముడిపడి ఉందని, దానికి ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యం ఉందని తమ ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఉద్యమ వారసత్వాన్ని ప్రతిబింబించే పేరును మరో రాజకీయ పార్టీ వినియోగించడం సముచితం కాదని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర సంస్థలతో పాటు బీఆర్ఎస్, ఇతర వ్యక్తులు, సంస్థల నుంచి కలిపి దాదాపు 700కు పైగా ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి చేరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు చుట్టూ నెలకొన్న వివాదం మరింత ముదిరింది.



# హైదరాబాద్‌లో భారీ వర్షం

- **పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం**
- **అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్**
- **అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం**

**హైదరాబాద్,జూన్ 13, ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

**హై అలర్ట్ ప్రకటించాలి : ముఖ్యమంత్రి**

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి,అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతోపాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

**వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ పరిశీలన**

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో డీజీపీ సి.వి. ఆనంద్ వర్ష ప్రభావిత ప్రాంతాలను శనివారం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. టోలిచౌకి పరిసరాల్లోని మల్కంపేట చెరువు ప్రాంతంతోపాటు సమీప ప్రాంతాలను పరిశీలించి, నీటి నిల్వలు, ట్రాఫిక్ అంతరాయాలు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతితో డీజీపీ సమావేశమై ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. రోడ్లపై నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ రద్దీని నివారించాలని, సాధారణ పరిస్థితులను త్వరగా పునరుద్ధరించేందుకు పౌర సంస్థలతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, కీలక కూడళ్ల వద్ద తగిన సంఖ్యలో సిబ్బందిని మోహరించి ట్రాఫిక్ నియంత్రణతోపాటు ప్రయాణికులకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. అదేవిధం గా హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వర్ష ప్రభావిత జిల్లాలన్నింటిలోని పోలీసు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల కారణంగా తలెత్తే ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని డీజీపీ ఆనంద్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ సంస్థలు, మున్సిపల్ అధికారులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు సకాలంలో సహాయం అందించాలని ఫీల్డ్ అధికారులకు సూచించారు. ప్రజలు ప్రయాణాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లరాదని, పోలీసులు, ఇతర ప్రభుత్వ సంస్థలు జారీ చేసే అధికారిక సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నెలకొన్న వర్ష పరిస్థితులను తెలంగాణ పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రజల భద్రత, సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవల వేగవంతమైన స్పందన కోసం కట్టుబడి పనిచేస్తున్నారని పునరుద్ఘాటించారు.

# అధికార యంత్రాంగానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వి అప్డేట్స్:**



రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం వర్షాల పరిస్థితిపై చర్చించారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో హై అలర్ట్ ప్రకటించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**సమన్వయంతో పనిచేయాలి**

వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సీఎం సూచించారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బృందాలను మోహరించాలని ఆదేశించారు. మున్సిపల్, పోలీస్ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాల్లో ముందుగానే విపత్తు నిర్వహణ బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డు, మున్సిపల్, పోలీస్ శాఖలు కలిసి ట్రాఫిక్ మళ్లింపు, నీటి తొలగింపు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ధికారుల నిరంతర పర్యవేక్షణ**

వర్షాల పరిస్థితిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సంబంధిత ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని వేగంగా అందించడంతో పాటు ఎలాంటి అత్యవసర పరిస్థితులైనా ఎదుర్కొనేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

# సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి

**మొదటిపేజీ తరువాయి**

శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బీఆరఎస్‌లపై నిప్పులు చెరిగారు. రెండు పార్టీలు బయటకు కొట్లాడుతున్నట్టు నటిస్తూ లోలోపల ఇద్దరు ఒకటిగా మారిపోయి ప్రజలను మోసం చేస్తున్నాయని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయలాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సంస్థలోని డిపెండెంట్ ఎంప్లాయిస్ సమస్యలపై స్పందిస్తూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎంతోమంది కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు.. వారి దరఖాస్తులను త్వరలో పరిశీలించి అర్హులైన వారికి ఇదేవిధంగా బహిరంగ సభ ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందిస్తామని ప్రకటించారు. సింగరేణి యాజమాన్యాన్ని ఈ దిశగా సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. ప్రజా ప్రభుత్వం సింగరేణిని దోపిడీ చేసే ప్రభుత్వం కాదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎల్పీ లీడర్‌గా ఆదిలాబాద్ జిల్లాలో చేసిన సుదీర్ఘ పాదయాత్రను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో బొగ్గు గనులను సందర్శించి కార్మికుల గుండె చప్పుళ్లను స్వయంగా విన్నానని చెప్పారు. రాబోయేది ఇందిరమ్మ రాజ్యమని, సింగరేణిని ప్రజల ఆస్తిగా కాపాడుకుంటామని చెప్పానని గుర్తు చేశారు. ఏ దోపిడీదారుల కబంధ హస్తాల్లోనూ, డేగలు, రాబందులు చేతుల్లోనో సింగరేణిని పడనీయమని డిప్యూటీ సీఎం ప్రకటించారు.

**దేశ చరిత్రలోనే తొలిసారిగా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా**

కార్మికుల ఆరోగ్యం, భద్రతపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి దేశంలోని మరే ప్రభుత్వానికి లేదని పునరుద్ఘాటించారు. ఏ సంస్థలోనూ లేని విధంగా సింగరేణి కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ. కోటి 25 లక్షల ప్రమాద బీమాను అందిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ పథకం కింద ఇప్పటికే దాదాపు రూ.40 నుంచి రూ.45 కోట్ల విలువైన చెక్కులను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం నియామక పత్రాల పంపిణీ మాత్రమే కాదని, కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న నమ్మకం, భరోసా, ధైర్యమని భట్టి చెప్పారు. కార్మికులకు రూ.10 లక్షల వరకు మెగా హెల్త్ ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. గతంలో కేవలం 40వేల మంది పర్మనెంట్ ఉద్యోగులకే ఇచ్చేవారన్నారు. సింగరేణి చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 30వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు బోనస్ ప్రకటించిందని ఆయన గర్వంగా ప్రకటించారు.

**సింగరేణికి నష్టం కలిగించింది బీఆర్ఎస్సే**

b4సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ చేస్తోంది అంటూ బీఆర్ఎస్ నేత హరీష్ రావు చేస్తున్న ఆరోపణలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. సింగరేణికి నష్టం చేసింది ఎవరైనా ఉన్నారంటే అది బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం మాత్రమే అని చెప్పారు. 2014 లో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చే వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని కోల్ బ్లాకులన్నీ సింగరేణికే అప్పగించేవారు. బీఆరఎస్ వచ్చాక సింగరేణికి రావలసిన కోల్ బ్లాకులు రాకుండా కుట్రపూరితంగా అడ్డుకున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. దొంగే దొంగ అన్నట్లు బీఆరఎస్, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయన్నారు. సింగరేణిలో బొగ్గు కదలాలన్నా అత్యంత పటిష్టమైన నిఘా వ్యవస్థ ఉందని, అలాంటి సంస్థపై అభాండాలు వేస్తూ నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి పరిధిలోని కోల్ బ్లాకులను తమకు అనుకూలమైన ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే దుర్మార్గపు కుట్రతోనే బీఆరఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. హరీష్ రావు ఒక లేఖ రాస్తారు.. ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి మాట్లాడుతుంటారని వీరి మధ్య ఉన్న అంతర్గత బంధాన్ని ఎండగట్టారు. పదేళ్లు మంత్రిగా చేసిన హరీష్‌రావు తన మంత్రి హోదాను మరిచి రోజుకో అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కోయగూడెం బ్లాక్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల దాదాపు 67 మిలియన్ టన్నుల బొగ్గును సంస్థ కోల్పోయిందని చెప్పారు. మార్కెట్ విలువ దాదాపు రూ.29,106 కోట్లు ఉంటుందని, తద్వారా సింగరేణికి రావాల్సిన రూ.19,360 కోట్ల లాభం చేజారిపోయిందని మండిపడ్డారు. సత్తుపల్లి బ్లాక్6కు ఆనుకుని ఉన్న సత్తుపల్లి బ్లాక్3 వేలంలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుపడ్డారని ఆరోపించారు. ఎనిమిదేళ్ల కాలంలో మైనింగ్ చేసుకునే అవకాశం ఉన్న కోయగూడెం బ్లాక్‌లో 32 మిలియన్ టన్నుల బొగ్గు అందుబాటులో ఉందన్నారు. సింగరేణి వేలంలో పాల్గొనకపోవడం వల్ల ఉత్పత్తి లేక రూ.10,032 కోట్ల ఆదాయం నష్టం వాటిల్లిందని చెప్పారు. దీని ద్వారా రావాల్సిన రూ.2,624 కోట్ల నికర లాభాన్ని సింగరేణి నష్టపోయిందన్నారు. వేలం నిబంధనల ప్రకారం బ్లాకులు దక్కించుకున్న వారు మైనింగ్ చేయలేకపోతున్నారు.. పైగా సమయం ముగిసింది.. మరి ఆ బ్లాకులను తిరిగి సింగరేణికే కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని రాతపూర్వకంగా కోరానన్నారు. తెలంగాణ ప్రతినిధిగా ఉన్నా ఆ బ్లాకులను సింగరేణికి ఎందుకు ఇప్పించలేకపోతున్నారని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. సింగరేణిని కాపాడుకోవడమే కాక కార్మికుల న్యాయబద్ధమైన హక్కులన్నింటినీ ఈ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. కొద్దిరోజులుగా జరుగుతున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ కార్మిక లోకానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. వేలాదిమంది కార్మికుల చెమట, శ్రమ పునాదులపై నిర్మితమైన సింగరేణి సౌధాన్ని కూల్చాలని హరీష్ రావు, కిషన్ రెడ్డిల ఆధ్వర్యంలో కుట్రలు జరుగుతున్నాయని భట్టి ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించిన సమస్యలపై తక్షణమే నిర్ణయం తీసుకుని ఈరోజు 335మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించామని చెప్పారు. భవిష్యత్తులోనూ ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ అనేది కార్మికుల హక్కు అని, దాన్ని కాదనడానికి ఎవరికీ వీల్లేదని స్పష్టం చేశారు. దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను అరికట్టడానికి, ఈ ప్రాంత మంత్రులు, శాసనసభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల అసలు సమస్యలను చర్చించినట్లు తెలిపారు. తక్షణమే న్యాయబద్ధంగా మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డును ప్రారంభించి చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యపై లోతుగా అధ్యయనం చేసి భవిష్యత్తులో ఎలాంటి న్యాయ సమస్యలు రాకుండా ఉండేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

సింగరేణి బోర్డు స్వయం ప్రతిపత్తి కలిగినదని గుర్తుచేశారు. రోజువారీ నిర్ణయాలలో, కార్యకలాపాలలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోదని, ప్రభుత్వానికి దాంతో సంబంధం ఉండదని వివరించారు. దాదాపు 135 సంవత్సరాల క్రితం నిర్ణయించుకున్న నిబంధనల ప్రకారం, ఆ బోర్డు తన స్వయం ప్రతిపత్తితోనే సింగరేణి అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

# మహిళా వారోత్సవాలు విజయవంతం

**మొదటిపేజీ తరువాయి**

సహాయక సంఘాల బలోపేతం, బాలికల్లో నాయకత్వ లక్షణాల పెంపు, మహిళల భద్రత, పారిశ్రామిక ప్రోత్సాహం, అక్షరాస్యత, బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారుల సంక్షేమం వంటి విభిన్న అంశాలపై వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వేలాది కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సెర్ప్, మెప్మా, అంగన్‌వాడీ వ్యవస్థ, వివిధ ప్రభుత్వ శాఖలు, స్వయం సహాయక సంఘాల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమాలు మహిళా సాధికారతను ప్రజా ఉద్యమంగా మార్చాయి. వారోత్సవాల ప్రారంభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. గ్రామీణ మహిళల సమావేశాలు, శిక్షణలు, జీవనోపాధి కార్యకలాపాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలకు ఈ భవనాలు కేంద్రాలుగా మారనున్నాయి. మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యూనిఫాం చీరలను కూడా ఆవిష్కరించారు. మహిళలను ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇంక్యుబేటర్ కార్యక్రమాలు, రుణ మేళాలు, జీవనోపాధి యూనిట్ల ప్రారంభోత్సవాలు, మార్కెటింగ్ అవకాశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా మధిరలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొలి సౌర విద్యుత్ కేంద్రం ప్రారంభం మహిళల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్‌లో ఉద్యోగినుల కోసం సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా చట్టంపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించారు.



'బాల్య వివాహం బతుకు ఆగం' నినాదంతో గ్రామ సభలు, ర్యాలీలు, కళాజాతాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాల నిరోధంపై చైతన్యం కల్పించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణకు ప్రాధాన్యతనిస్తూ 'బలమైన బాల్యానికి 1000 మెట్లు' కార్యక్రమం నిర్వహించగా, అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా 50 కొత్త అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించి, మరో 27 భవనాలకు శంకుస్థాపనలు చేపట్టారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం ద్వారా చిన్నారులకు యూనిఫారాలు, విద్యారంభ ధృవపత్రాలు అందజేయడంతోపాటు అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా అక్షరాస్యత సాధించిన మహిళలను సన్మానించారు. కిశోర బాలికల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్నేహ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మాక్ పార్లమెంట్‌లు, మాక్ అసెంబ్లీలు నిర్వహించారు. జిల్లాస్థాయిల్లో ప్రతిభ కనబరిచిన బాలికలతో హైదరాబాద్ జూబ్లీహాల్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీ అసెంబ్లీ సమావేశాలను తలపించింది. ప్రజా సమస్యలపై చర్చలు, విధానాలపై అభిప్రాయాల వ్యక్తీకరణ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన ద్వారా బాలికలకు భవిష్యత్ నాయకత్వానికి అవసరమైన పునాది ఏర్పడింది. అలాగే హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 9న నిర్వహించిన మహిళా శక్తి మహాసభ వారి సాధికారతకు ప్రతీకగా నిలిచింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు తమ ఐక్యత, సంకల్పాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాలకు కేటాయించిన 553 ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. మహిళలను బస్సుల యజమానులుగా ఎదిగేలా తీసుకొచ్చిన ఈ కార్యక్రమం మహిళా ఆర్థిక సాధికారతలో కీలక మైలురాయిగా నిలిచింది. అదే సభలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల ప్రోత్సాహకాన్ని విడుదల చేయడంతోపాటు బస్సుల అద్దె చార్జీల కింద మండల మహిళా సమాఖ్యలకు రూ.20.34 కోట్ల చెక్కులను అందజేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కుటుంబాలకు కలిగిన ఆర్థిక ప్రయోజనాలను ప్రతిబింబించేలా రూ.10,700 కోట్ల ఆదా వివరాలను వెల్లడించారు. మహిళా సంఘాల విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'మహిళా ప్రగతి' మాసపత్రికను కూడా ఆవిష్కరించారు.

## షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీస్

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వి అప్డేట్స్:**

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

- **రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగం**
- **ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు**
- **'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర'లో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, జూన్ 13, ఆశ్వి అప్డేట్స్ :**

హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా, ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఎకో సిస్టం'ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలోని యశోదా హాస్పిటల్‌లో రెండ్రోజులపాటు నిర్వహించనున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర'ను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏఐ ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్నింటికీ విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. ముఖ్యంగా వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని చేర్చిందన్నారు. అలాగే ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారిందన్నారు. అయితే ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టం చేశారు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న తరుణంలో క్యాన్సర్, గుండె జబ్బులు వంటి క్లిష్టమైన ఆరోగ్య సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందన్నారు. అందుకు హైదరాబాద్‌ను ఒక లాంచ్ ప్యాడ్‌గా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అకాడెమియా, ఇండస్ట్రీ మధ్య బలమైన అనుసంధానం ఏర్పడినప్పుడే ఏఐ హెల్త్ కేర్ ఆవిష్కరణలు సామాన్యుడికి అందుతాయన్నారు. భవిష్యత్తు సవాళ్లను ముందే ఎదుర్కొనేలా కొత్త ఆలోచనల్ని ప్రోత్సహించే ఇన్నోవేషన్ ఆధారిత వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఆవిష్కరణలు కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాకుండా సమాజంలో నిజమైన మార్పును తీసుకొచ్చేలా ఆవిష్కర్తలు, స్టార్టప్స్‌కు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పరిశోధనలకు ఊతమిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్‌ఛేంజ్‌ను ప్రారంభించామన్నారు. లైఫ్ సైన్సెస్‌లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'వన్ బయో' పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టార్టప్స్‌కు అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వామ్యం కావాలని నిపుణులు, ఆవిష్కర్తలు, కంపెనీలు, స్టార్టప్స్‌ను సాదరంగా ఆహ్వానించారు.

# పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు

- దేశంలోనే ఉత్తమ పోలీసు ధృవీకరణ సేవలకు 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' - డీజీపీ సి.వి. ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆహ్వానం
- జూన్ 19 న అవార్డ్ ను అందుకోనున్న డీజీపీ

**హైదరాబాద్, జూన్ 12:**



పాస్‌పోర్ట్ దరఖాస్తుల పరిశీలన, పోలీసు ధృవీకరణ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు తెలంగాణ పోలీస్ శాఖకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. 202526 సంవత్సరంలో పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధృవీకరణలో విశిష్ట సేవలు అందించిన రాష్ట్ర పోలీసు సంస్థగా తెలంగాణ పోలీస్ శాఖను ఎంపిక చేస్తూ ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు ("Institutional Performance Award for State Police") అవార్డును ప్రకటించింది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీ (PSP) & చీఫ్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ శ్రీ బి.ఎస్. ముబారక్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) శ్రీ సి.వి. ఆనంద్, ఐపీఎస్‌కు అధికారిక లేఖ పంపారు.

ప్రతి సంవత్సరం జూన్ నెలలో నిర్వహించే పాస్ పోర్ట్ సేవ సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది పాస్‌పోర్ట్ సేవా దివస్ మరియు పాస్‌పోర్ట్ అధికారుల సదస్సు జూన్ 18, 19 తేదీల్లో న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ భవన్‌లో నిర్వహించనున్నారు. న్యూ ఢిల్లీలో జూన్ 19న జరిగే కార్యక్రమంలో కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా డిజిపి సి వి ఆనంద్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోనున్నారు. పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో పోలీసు ధృవీకరణ అత్యంత కీలకమైన అంశమని, ఈ విభాగంలో తెలంగాణ పోలీసులు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడం వల్లే ఈ గుర్తింపు దక్కిందని డిజిపి పేర్కొన్నారు. అలాగే పాస్‌పోర్ట్ సేవా దివస్‌లో భాగంగా నిర్వహించే హైలెవల్ సెగ్మెంట్ కార్యక్రమానికి డీజీపీ సి.వి. ఆనంద్‌ను విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఆయన హాజరు కార్యక్రమ విజయానికి దోహదపడుతుందని పేర్కొంది. రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన సాంకేతిక ఆధారిత పోలీసు ధృవీకరణ విధానం, వేగవంతమైన సేవలందింపు, ప్రజా కేంద్రిత దృక్పథం వల్లే ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని డిజిపి తెలిపారు. ఈ అవార్డు తెలంగాణ పోలీసుల సేవా నిబద్ధతకు, వృత్తిపరమైన నైపుణ్యానికి మరో నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పురస్కారం ద్వారా దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠ మరింత పెరిగిందని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.



## బంగారం మెరిపిస్తామంటూ మోసం

- 8 గ్రాముల బంగారం అపహరణ

**దుబ్బాక , ఆశ్వి అప్డేట్స్**

బంగారు ఆభరణాలను మెరిపిస్తామంటూ మహిళను నమ్మించి సుమారు 8 గ్రాముల బంగారాన్ని అపహరించిన ఘటన సిద్దిపేట జిల్లాతొగుట మండలం వెంకట్రావుపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామంలోకి వచ్చిన ఇద్దరు యువకులు ప్రత్యేక పౌడర్, రసాయన ద్రావణంతో బంగారం, వెండి ఆభరణాలను శుభ్రపరచి కొత్తవాటిలా మెరిపిస్తామని పలువురు మహిళలకు తెలిపారు. అయితే గ్రామస్తులు వారి మాటలను పెద్దగా పట్టించుకోలేదు. అనంతరం వారు గ్రామానికి చెందిన కళ్లెపు అనూష ఇంటికి వెళ్లి తమ వద్ద ఉన్న పౌడర్‌ను చేతులపై వేసి నమ్మకం కల్పించారు.అనూష మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, ఆమె చెల్లికి చెందిన వెండి పట్ట గొలుసులను శుభ్రం చేస్తామని తీసుకుని రసాయన ద్రావణంలో ముంచారు. కొంతసేపటి అనంతరం ఆభరణాలను తిరిగి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.తర్వాత ఆభరణాల బరువు తగ్గినట్లు అనుమానం రావడంతో బాధితులు స్థానిక బంగారు దుకాణంలో తూకం వేయించగా సుమారు 8 గ్రాముల బంగారం కరిగించి అపహరించినట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.ఘటనపై సమాచారం అందుకున్న తొగుట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బంగారం, వెండి ఆభరణాలను మెరిపిస్తామని చెప్పే అపరిచితులను నమ్మవద్దని, విలువైన వస్తువులను వారి చేతికి అప్పగించవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.



## విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి.. రైతుకు భారీ నష్టం

**దుబ్బాక, ఆశ్వి అప్డేట్స్**

దుబ్బాక మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో శనివారం జరిగిన ప్రమాదంలో విద్యుత్ ఘాతానికి గురై పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు కల్వకుంట (మంగలి) భూపాల్‌కు చెందిన వ్యవసాయ భూమిలో విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా విరిగి పడడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.విరిగిపడిన స్తంభానికి సంబంధించిన విద్యుత్ తీగలు కిందపడగా, అదే సమయంలో అక్కడ మేత మేస్తున్న పాడి గేదె వాటికి తగలడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని రైతు భూపాల్ తెలిపారు. గేదె మరణంతో కుటుంబ పోషణకు ఆధారమైన పాడి ఆదాయం కోల్పోయి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఘటనపై స్పందించిన గ్రామ సర్పంచ్ బాలెంల శ్రీలత రామచంద్రారెడ్డి బాధిత రైతును పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బాధిత రైతుకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని వెంటనే పునరుద్ధరించి, బాధిత రైతుకు తగిన పరిహారం మంజూరు చేయాలని గ్రామస్తులు, రైతు భూపాల్ సంబంధిత అధికారులను కోరుతున్నారు.




## ఎర్ర మొరం దొంగలకు అడ్డు అదుపు లేదు..!

- రామలింగప్ప గుట్టను ఖాళీ చేస్తున్న అక్రమార్కులు
- అర్ధరాత్రి, తెల్లవారుజామున యథేచ్ఛగా మొరం రవాణా
- ఇంకెప్పుడు స్పందిస్తారు మైనింగ్ అధికారులు..?

**అశ్వి అప్డేట్:**
**నారాయణపేట 12**

నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలో అక్రమ మొరం తవ్వకాలు, రవాణా జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పులిమామిడి గ్రామ శివారులోని రామలింగప్ప గుట్ట నుంచి భారీ ఎత్తున ఎర్ర మొరంను అక్రమంగా తరలిస్తూ కొందరు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, సహజ వనరులను దోచుకుంటున్న ఈ అక్రమ దందాపై అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు జేసీబీల సహాయంతో గుట్టను తవ్వి మొరంను టిప్పర్లు, ట్రాక్టర్లలో లోడ్ చేసి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. వెంచర్లు, దుకాణ సముదాయాలు, గృహ నిర్మాణాలు, కోళ్ల ఫారాల నిర్మాణాలకు ఈ మొరంను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దూరాన్ని బట్టి ఒక్క టిప్పర్‌కు రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.నియమాల ప్రకారం మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా మట్టి లేదా మొరం తవ్వడం, రవాణా చేయడం నేరం. అయినప్పటికీ ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ అక్రమ వ్యవహారం నిరాటంకంగా కొనసాగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో జరుగుతున్న విచ్చలవిడి తవ్వకాల వల్ల రామలింగప్ప గుట్ట సహజ స్వరూపం కోల్పోతుండగా, పర్యావరణ సమతుల్యతకు కూడా ముప్పు వాటిల్లుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే అక్రమ మొరం దందాకు ప్రధాన కారణమని వారు విమర్శిస్తున్నారు.

**మైనింగ్ శాఖ మేల్కొనేదెప్పుడు..?**

గుట్టలను గుల్ల చేస్తున్న అక్రమ తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ శాఖలు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా మొరం తవ్వుతున్న వారిని గుర్తించి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సహజ సంపదను కాపాడేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.




## ప్రపంచం మెచ్చిన విశ్వ నాయకుడు మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

- బిజెపి ఎమ్మెల్సీ ఏబీఎన్ రెడ్డి

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 12**

ప్రపంచం మెచ్చిన విశ్వనాయకుడు భారతదేశ ప్రధానిగా శ్రీ నరేంద్రమోదీ గారి నిరంతరం దాదాపు 12+ (4402 days +) సంవత్సరాలకు పైగా విష్వసం అభివృద్ధి ప్రజా సంక్షేమంలో బాధ్యత నిర్వహిస్తూ గతంలోని మొదటి ప్రధాని నెహ్రూ గారి రికార్డ్ ను అధిగమించినందుకుగాను జాతీయ పార్టీ, రాష్ట్ర శాఖ పిలుపుమేరకు జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ సమక్షంలో ముఖ్య అతిథిగా బీజేపీ MLC AVN రెడ్డి గారు మాట్లాడుతూ దేశంలో కేంద్ర నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలతో ప్రతి అట్టడుగు స్థాయి వరకు చేరే విధంగా పనిచేస్తుందని వికసిత భారత్ దిశగా అడుగులు వేస్తోందని వ్యవసాయ రంగం లో గాని రక్షణ , వైజ్ఞానిక , మహిళ శశక్తి లో గాని వ్యాపార రంగంలో గాని రైల్వే, విమాన, నౌక విద్య వైద్య పరిశ్రమ రంగంలో రాజకీయాలకు అతీతంగా సబ్ క సత్ సబ్ క వికాస్ ఉదేశ్యం లో 70 సంవత్సరలో ఎన్నడు లేనివిధంగా అభివృద్ధి దిశ గా పరుగులు తీస్తుందని అని మోదీ ప్రభుత్వ సుపరిపాలన వల్లే ప్రజాదరణ లో మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దేశ పురోగతోకి తోడ్పడుతున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజి గారు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి సీనియర్ నాయకులు కొండయ్య గారు రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రఘురామయ్యా గౌడ్ గారు రాష్ట్ర స్పోక పర్సన్ నాగేంద్ర గారు సంగారెడ్డి ఇంచార్జి పగడకుల శ్రీనివాస్ గారు బంటు రమేష్ గారు పేట మున్సిపల్ వైస్ చైర్మన్ మంజులా GR రెడ్డి లక్ష్మీ గౌడ్ వెంకటయ్య రఘువీర్ యాదవ్ శ్రీనివాస్ ముఖ్య నాయకులు కౌన్సిలర్లు పత్రిక సమావేశం నిర్వహించడం జరిగింది.



## హైదరాబాద్‌లో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్ భగ్నం...

నగరంలోని ఎల్బీనగర్ పరిధిలో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్‌ను పోలీసులు భగ్నం చేశారు. వనస్థలిపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌పై పోలీసులు డికాయ్ ఆపరేషన్ నిర్వహించారు. హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.మహిళా పోలీసును డికాయ్‌గా పంపి ఆధారాలు సేకరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తామంటూ హాస్పిటల్ సిబ్బంది హామీ ఇచ్చారు. నిందితులు తుక్కుగూడలోని ఓ క్లినిక్‌కు గర్భిణులను రిఫర్ చేశారు. క్లినిక్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను పోలీసులు పట్టుకున్నారు.రిసెప్షనిస్ట్ లోకేశ్‌ను కూడా అరెస్ట్ చేసిన పోలీసులు..ముగ్గురిపై పీసీపీఎన్‌డీటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.గర్భంలోని శిశువు లింగాన్ని వెల్లడించడం చట్టరీత్యా నేరమని పోలీసులు తెలిపారు.అక్రమ లింగ నిర్ధారణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ అంశంపై కేసు నమోదు చేసిన వనస్థలిపురం పోలీసులు దర్యాప్తు చేపట్టారు..





## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

- వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం, అడవి వెంకటాపూర్ గ్రామంలో ఘోర విషాదం
- ఇద్దరు బిడ్డలను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నతల్లి
- కన్నతల్లి కసాయిగా మారిన ఘటన

**వికారాబాద్ జిల్లా కుల్కచర్ల :**

కుటుంబ కలహాలతో తల్లి తన ఇద్దరు పిల్లలను చంపి తాను ఆత్మ హత్య చేసుకున్న ఘటన చౌడాపూర్ మండలం అడవివెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు పలువురు తెలిపిన వివరాల ప్రకారం... అడివి వెంకటాపూర్ గ్రామానికి చెందిన జంబుల మల్లేష్ (32) భార్య జంబుల నవనీత (సునీత ) (27) వీరికి ఇద్దరు పిల్లలు కుమారుడు విగ్నేష్ (7), కూతురు మధుప్రియ (5) కలరు.తరచూ కుటుంబంలో జరిగే గొడవలతో మనస్థాపం చెందిన నవనీత పిల్లలను ఉరివేసి చంపి తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరు చిన్నారులు, తల్లి మృతి చెందడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అల్లుకున్నాయి.ఈ విషయం తెలియడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

- అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం.

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 12**



మోసపోయిన గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.

జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ గారు తెలిపారు.





# విశ్వబ్రాహ్మణ జాతి ఐక్యతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- - రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కాసోజు శంకరమ్మను కోరిన విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తూములూరి సత్యనారాయణ

**ఆశ్వి అప్డేట్స్ హైదరాబాద్ జూన్ 13:**

విశ్వబ్రాహ్మణ జాతి ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు తూములూరి సత్యనారాయణ చారి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి కాసోజు శంకరమ్మను సంఘం ప్రతినిధులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా కాసోజు శంకరమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తూములూరి సత్యనారాయణ చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సమాజం అభివృద్ధి చెందాలంటే జాతి బిడ్డలంతా ఐక్యంగా ఉండాలని, సమాజ ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని కోరారు. విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సామాజిక అభ్యున్నతి కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాసోజు శంకరమ్మ మాట్లాడుతూ మహిళా కమిషన్ సభ్యురాలిగా మహిళల హక్కుల పరిరక్షణ, సాధికారత, సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండోజు శ్రీనివాస్, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి మండలోజు వరప్రసాద్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష నరసింహచారి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తల్లోజు బ్రహ్మయ్య చారి,సంఘం నాయకులు నెమలికొండ గోవిందాచారి,దాట్ల కృష్ణమూర్తి, వెంకటాచారి, సంతోష్ కుమార్, సంజయ్ చారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.






# బీవీఆర్ఐటీలోవిజయవంతంగా ముగిసిన వామ్స్ 2026 అంతర్జాతీయ సదస్సు

- **5 రోజులు జరిగిన అంతర్జాతీయ సదస్సు**
- **వృత్తిపరమైన అభివృద్ధికి వేదిక**
- **ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణుల మేధోమదనం**
- **వామ్స్ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు**
- **ఎలక్ట్రానిక్స్ రంగానికి గట్టి పునాది**
- **మొదటి బహుమతి ఒక లక్ష రూపాయలు**

**నర్సాపూర్ జూన్ 13( ఆశ్వి అప్డేట్స్ )**

మెదక్ జిల్లా నర్సాపూర్ లో బి.వి. రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు నిర్వహించిన 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నా అండ్ మైక్రోవేవ్ అంతర్జాతీయ సదస్సు ఐదు రోజుల పాటు విజయవంతంగా ముగిసింది. ఈ అంతర్జాతీయ సదస్సు లో శాస్త్రీయ పరిశోధనలు, పరిశ్రమ-విద్యా సంస్థల పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి మరియు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు వేదికగా నిలిచింది.ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వామ్స్ సలహాదారు డా. సుధాకర్ కె. రావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇంతటి చక్కని సదుపాయాలు మంచి ఆరోగ్యకరంగా పచ్చని వాతావరణంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరిగేందుకు ప్రోత్సాహం సహాయ సదుపాయాలు కల్పించిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె వి విష్ణురాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు ఈ సదస్సులో తెలిపారు.వామ్స్ జనరల్ చైర్, బీవీఆర్ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. బి.ఆర్. సంజీవరెడ్డి అధ్యక్షత వహించగా, , డా. పి. సతీష్ రామచౌదరి, డా. వి. సమీర్ చక్రవర్తి, బీవీఆర్ఐటీ డైరెక్టర్ డా. కె. లక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు.వామ్స్ ప్రతిష్ఠాత్మక అవార్డులు: వామ్స్ సదస్సులో అత్యున్నత గౌరవం గా భావించే డా. సుధాకర్ రావు స్పెషల్ రికగ్నిషన్ అవార్డు" ను రూ.1,00,000 నగదు బహుమతితో ప్రొఫెసర్ సమీర్ చక్రవర్తి వేదుల ప్రొఫెసర్ పి. సతీష్ రామచౌదరిలకు సంయుక్తంగా అందజేశారు. వామ్స్ సదస్సు అభివృద్ధికి మరియు ఇంజనీరింగ్ సమాజానికి వారు అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ అవార్డు ను ప్రదానం చేశారు.అదేవిధంగా, రూ.50,000 నగదు బహుమతితో కూడిన డా. సుధాకర్ రావు బెస్ట్ పేపర్ అవార్డు"ను అహ్మదాబాద్ లోని ఇస్రో-స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ కు చెందిన శ్రీ రోహిత్ నంద్వానీ గారికి ఆయన అత్యుత్తమ పరిశోధన కృషికి గాను ప్రదానం చేశారు. యాంటెన్నా రూపకల్పన, వైర్లెస్ కమ్యూనికేషన్, రంగాలలో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు డా. సి. జె. రెడ్డి, డా. నాసర్ చాహట్ , డా. జోనాథన్ సాడర్, నాసా జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ, అమెరికాకు చెందిన వారికి ప్రొఫెసర్ లాట్ షఫాయ్, డా. డెస్మండ్ సిమ్, డా. జయశ్రీ కులకర్ణి మరియు డా. జుబైర్ అక్తర్ వారి పరిశోధన రంగాలలో 10 వేల రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు నగదు బహుమతి పొందటం జరిగింది. సాంకేతిక ఆవిష్కరణలకు గుర్తింపుగా 60కి పైగా ప్రతిష్ఠాత్మక అవార్డులను సదస్సులో ప్రదానం చేశారు.బీవీఆర్ఐటీ డైరెక్టర్ డా. కె. లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ, పరిశోధనలో నూతన ఒరవడిని ప్రోత్సహించడం, ముఖ్య ఉద్దేశమని తెలియపరిచారు. ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబె మాట్లాడుతూ వామ్స్ ద్వారా బీవీఆర్ఐటీ కి అంతర్జాతీయ గుర్తింపు మరింత పెరిగిందన్నారు.ఈ సదస్సు విజయవంతంగా నిర్వహించడంలో బీవీఆర్ఐటీ యాజమాన్యం, డైరెక్టర్ డా. కె. లక్ష్మి ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబె, అధ్యాపక బృందం, విద్యార్థి వాలంటీర్లు, పరిపాలనా సిబ్బంది, మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్ బాపిరాజు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ కీలక పాత్ర పోషించారు. వామ్స్ ని విజయవంతంగా నిర్వహించిన బీవీఆర్ఐటీ యాజమాన్యానికి ఐఈఈఈ యాంటెన్నాస్ అండ్ ప్రొపగేషన్ సొసైటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సదస్సులో జాతీయ అంతర్జాతీయ దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, ప్రరిశ్రమ రంగ నిపుణులు, ప్రతిష్టాత్మకమైన విద్య సంస్థల అధ్యాపకులు విద్యార్థులు,ఇస్రో, సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.



# మధ్యాహ్న భోజన పథకం సమర్థ అమలుకు కాంప్లెక్స్ స్థాయి శిక్షణ

- **విద్యార్థులకు సుచి,రుచికర భోజనం అందించాలి**
- **మండల విద్యాధికారి జె. ప్రభుదాస్**

**దుబ్బాక, ఆశ్వి అప్డేట్స్**

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దుబ్బాక కాంప్లెక్స్‌లో ప్రధానమంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ (మధ్యాహ్న భోజన పథకం) అమలుపై కాంప్లెక్స్ స్థాయి శిక్షణా సమావేశం శనివారం నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పట్నం భూపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి జె. ప్రభుదాస్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.డీసీఈబీ కన్వీనర్ చక్రపాణి మాట్లాడుతూ వారానికి మూడు రోజులు గుడ్డు, మూడు రోజులు జావ అందించడం తప్పనిసరి అని తెలిపారు. ప్రభుత్వం నెలనెలా నిధులు విడుదల చేస్తున్నందున కార్మికులపై అదనపు ఆర్థిక భారం తగ్గిందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు పట్నం భూపాల్ మాట్లాడుతూ ఎజెండా వారీగా శిక్షణ నిర్వహిస్తున్నామని, మధ్యాహ్న భోజన తయారీ, వడ్డింపు విధానాలపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో కార్మికుల పాత్ర కీలకమని, వారి సేవలు విద్యార్థుల ఆరోగ్యం, శక్తిసామర్థ్యాల పెంపునకు దోహదపడతాయని పేర్కొన్నారు. సీనియర్ ఉపాధ్యాయురాలు రజిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన తయారీ, పంపిణీలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్పీ శ్రీనివాసు, కాంప్లెక్స్ కన్వీనర్ మధుసూదన్, సీఆర్పీ రవి, ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.





# ప్రజాక్షేత్రంలో 'సర్దార్'DNR

- **నల్లగొండ రాజకీయాల్లో చెరగని ముద్ర దుబ్బాక నరసన్న!**
- **ఘనంగా రెండు రోజుల పాటు జన్మదిన వేడుకలు**
- **ఊరూ వాడా సందడిగా నిర్వహించిన అభిమానులు**

**ఆశ్వి అప్డేట్ నల్లగొండ జూన్ 13:**

రాజకీయాల్లో పదవులు రావచ్చు.. పోవచ్చు. కానీ, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడం అందరికీ సాధ్యం కాదు. పదవుల కంటే ప్రజాసేవకే ప్రాధాన్యం ఇస్తూ, నల్లగొండ జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్నారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దుబ్బాక నరసింహారెడ్డి (డీఎన్ఆర్). అభిమానులు, అనుచరులు ఆయనను ప్రేమగా పిలుచుకునే 'సర్దార్ దుబ్బాక నరసన్న' అనే పేరు వెనుక దశాబ్దాల ప్రజా పోరాటం, పరోపకార గుణం దాగి ఉన్నాయి. రెండు రోజుల పాటు జరిగిన ఆయన జన్మదిన వేడుకలు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో, మిన్నంటిన సేవా కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. డీఎన్ఆర్ ఆశయాలకు అద్దం పట్టేలా రెండు రోజుల పాటు సేవా కార్యక్రమాలతో సాగాయి. దుబ్బాక యువసేన, కాంగ్రెస్ శ్రేణులు జిల్లా అంతటా పెద్ద ఎత్తున సామాజిక కార్యక్రమాలు చేపట్టాయి. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. నల్లగొండ పట్టణంలోని నిర్మల అనాథ శరణాలయంలోని పిల్లలకు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారికి అన్నదానం చేసి తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. సేవా కార్యక్రమాల అనంతరం దుబ్బాక నరసింహారెడ్డి క్యాంపు కార్యాలయంలో 'దుబ్బాక యువసేన' ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయన ఘనంగా కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ జిల్లపల్లి పరమేష్, ఆదిమల్ల శంకర్, ముంతాజ్ అలీ, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, చర్లపల్లి గౌతం, పగిళ్ల శివ, జహంగీర్, మర్రి మదన్, పగిళ్ల రాజు, బెల్లంకొండ సురేష్, ఆకటి సైదులు, మండలి శంకర్, మనిమద్దే పరమేశ్, సందీప్, బాలకృష్ణ, మంజునాథ్, రాజేష్ తదితర ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.దైవసన్నిధిలో ప్రత్యేక పూజలు: చారిత్రాత్మక ఛాయా సోమేశ్వర ఆలయంలో డీఎన్ఆర్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**'సర్దార్'.. ఆ పేరు ఒక నమ్మకం, ఒక చరిత్ర!**

"ఎక్కడ సమస్య ఉంటే అక్కడ డీఎన్ఆర్ ఉంటారు. ఎక్కడ రైతాంగం కష్టాల్లో ఉంటే అక్కడ నరసన్న గళం వినిపిస్తుంది. దేనికైనా వెనకడుగు వేయని నైజమే ఆయనను ప్రజా నాయకుడిని చేసింది." నల్లగొండ జిల్లా రాజకీయాల్లో దుబ్బాక నరసింహారెడ్డిది ఒక విలక్షణమైన శైలి. స్థానిక సమస్యలపై, ముఖ్యంగా రైతాంగ సంక్షేమంపై ఆయన నిరంతరం పోరాటాలు చేస్తూ వస్తున్నారు. గతంలో ఆయన స్థానిక సమస్యలపై సవాల్ చేసి, తన పదవికి రాజీనామా చేసి మరీ రిఫరెండమ్‌కు వెళ్లడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ ఎన్నికల్లో ఆయన సాధించిన భారీ మెజార్టీ ఒక చారిత్రాత్మక రికార్డు. ఇప్పటికీ ఆ రికార్డును ఎవరూ బద్దలు కొట్టలేకపోయారు. ఎంతలా అంటే, నేటికి పోటీ పరీక్షల ప్రిపరేషన్‌లో జనరల్ నాలెడ్జ్ అంశంగా దుబ్బాక నరసింహారెడ్డి పేరు మార్మోగుతూనే ఉంటుంది.

**అధిష్టానానికి విధేయుడు.. సీఎం రేవంత్ రెడ్డికి ఆప్తుడు**

కాంగ్రెస్ పార్టీలో ఎందరో నాయకులు వస్తుంటారు, పోతుంటారు. కానీ, కష్టకాలంలోనూ పార్టీ జెండాను నమ్ముకుని, క్రమశిక్షణ గల కార్యకర్తలా నిలబడిన కొద్దిమంది నాయకులలో డీఎన్ఆర్ ఒకరు. పదవులను ఆశించకుండా ప్రజాసేవకే అంకితమైన ఆయన నిబద్ధతను కాంగ్రెస్ అధిష్టానం ఎల్లప్పుడూ గౌరవిస్తూనే ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా, నల్లగొండ జిల్లా ముఖ్య నేత, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా డీఎన్ఆర్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. పార్టీ కోసం ఆయన పడిన కష్టాన్ని గుర్తిస్తూ, త్వరలోనే ఆయనకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కనుందనే బలమైన చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. పదవులు ఆయనను వెతుక్కుంటూ రావడం డీఎన్ఆర్ రాజకీయ జీవితానికే ఒక మకుటం. మనసున్న మారాజుగా, వెనకడుగు వేయని 'సర్దార్'గా నల్లగొండ ప్రజల హృదయాల్లో నిలిచిన దుబ్బాక నరసింహారెడ్డి మరిన్ని పుట్టిన రోజులు జరుపుకుంటూ, ప్రజలకు ఇలాగే సేవ చేయాలని ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆశిస్తున్నారు.







# ప్రజల దాహార్తిని తీర్చడమే మా ధ్యేయం: సర్పంచ్ మల్లం కనకవ్వఐలయ్య

**ఆశ్వి అప్టేట్స్ కొండపాక:**


గ్రామ ప్రజల తాగునీటి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తామని కుకునూర్ పల్లి సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య పేర్కొన్నారు. శనివారం గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నూతనంగా బోరు ని వేయించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో నీటి కొరత రాకుండా ముందస్తుగా ఈ బోరుని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు నిరంతరం, సురక్షితమైన తాగునీటిని అందించడానికి ప్రాధాన్యత ఇస్తామని, తాగునీటి విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దోంతి సత్యం తదితరులు ఉన్నారు

# ఉద్యాన శాఖ కమిషనర్ ను కలసిన అధికారులు

**సూర్యాపేట జూన్ 13**



రాష్ట్ర ఉద్యాన పట్టు పరిశ్రమ కమిషనర్ ఎం డి యాస్మిన్ బాషా ను సూర్యాపేట జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య ఆధ్వర్యంలో అ శాఖ జిల్లా సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం నల్లగొండ పట్టణంలో జరిగిన బత్తాయి రైతుల సమావేశానికి విచ్చేసిన కమిషనర్ ను శాలువా తో సత్కరించి బోకే అందజేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఈ సంవత్సరం సూర్యాపేట జిల్లా కు ప్రభుత్వం ఇచ్చిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యం పూరిచేయాలన్నారు. టీ జి ఆయిల్ ఫెడ్ సంస్థ ను సమానవ్యం చేసుకొని జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ను ప్రోత్సాహించాలని కోరారు. ఉద్యాన శాఖ పథకాలు క్షేత్ర స్థాయిలో తీసుకు వెళ్లి రైతులు రాయుతి లు సద్వినియోగం చేసుకొని పంట మార్పిడి చేయనుకునేలా కృషి చేయాలనీ అన్నారు. కమిషనర్ ను కలసిన వారిలో జిల్లా లోని ఉద్యాన అధికారులు కట్ట స్వాతి, ఎల్ ప్రదీప్తి, పి అనిత, వి. ప్రమిత, విస్తరణ అధికారులు రంగు ముత్యం రాజు, కట్టాగూరి రాము, వంగూరి అనిల్, అంకతి ప్రభాకర్, తదితరులు ఉన్నారు.



# కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుని ఘనంగా సన్మానించిన ఉద్యమకారుల పోరం నాయకులు

**ఆశ్వి అప్డేట్స్ :**

వలిగొండ మండల కాంగ్రెస్ పార్టి నూతన అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన బత్తిని సహదేవ్ గౌడ్ ను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కమిటీని వేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉద్యమకారుల ఫోరం నాయకుడు బత్తిని సహదేవ గౌడ్ ను అధ్యక్షునిగా నియమించడం పట్ల ఆయన వర్షం వ్యక్తం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు సహదేవ్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని మాట తప్పకుండా నెరవేరుస్తుందని, తనను సన్మానించిన ఉద్యమకారుల ఫోరం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజయ్య, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, ఫోరం గౌరవ అధ్యక్షుడుకళ్లెం లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు గంధ మల్ల మల్లమ్మ, చిలుగూరిసత్తిరెడ్డి, బత్తిని రవీందర్, మల్లం వెంకటేశం,బొడిగేసుదర్శన్, కదిరేని స్వామి,కొండూరు సత్తయ్య,దండ మల్లికార్జున్, సుంకి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్ల గురువారెడ్డి సేవలు చిరస్మరణీయం

- **జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి**
- **వర్ధంతి సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి**

**సిద్దిపేట, ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సిద్దిపేట తొలి ఎమ్మెల్యే, ప్రజానాయకుడు ఎడ్ల గురువారెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా శనివారం సిద్దిపేట పట్టణంలోని విక్టరీ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, రచయిత నందిని సిద్ధారెడ్డి ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో ఎడ్ల గురువారెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాటంలో ఆయన ధైర్య సాహసాలతో పాల్గొని ప్రజల హక్కుల కోసం అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని కొనసాగించిన ఆయన సిద్దిపేట తొలి ఎమ్మెల్యేగా ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని గుర్తు చేశారు. రైతులు, కూలీలు, పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన ప్రజానాయకుడిగా ఎడ్ల గురువారెడ్డి నిలిచిపోయారని తెలిపారు. నేటి తరానికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని, తెలంగాణ చరిత్రలో ఆయన చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి, ప్రజా సేవలను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ఎడ్ల గురువారెడ్డి జీవిత చరిత్రను రాష్ట్ర పాఠ్యపుస్తకాలలో చేర్చి విద్యార్థులకు పరిచయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ ఎడ్ల గురువారెడ్డి కమ్యూనిస్టు ఉద్యమానికి, రైతాంగ పోరాటాలకు చేసిన సేవలు అపారమని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీ పడకుండా పోరాడిన నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు డా. పాపయ్య, సీనియర్ పాత్రికేయులు అంజయ్య, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, సీపీఐ సీనియర్ నాయకుడు ఎడ్ల వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కిష్టపురం లక్ష్మణ్, నాయకులు గజాభీమకర్ బన్సీలాల్, హరిఫ్, చంద్రం, మల్లేశం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షా ల నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారుల ను అలెర్ట్ చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- పై స్థాయి నుండి కింద స్థాయి వరకు గల ఆర్ అండ్ బి ఇంజనీర్లు అందరు క్షేత్ర స్థాయిలో ఉండాలి
- భారీ వర్షా ల వల్ల..వరదలతో ముందుగా ఇబ్బందిగా మారే రోడ్లు,బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి
- ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి
- రెవెన్యూ,పోలీసు, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్ ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలి
- శని,ఆదివారాలు ఏమి లేవు... అందరు ఫీల్డ్ లో ఉండాల్సిందే
- హైదరాబాద్ ఎర్రమంజిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా మానిటరింగ్ చేయాలి
- రాష్ట్రంలోని అన్ని ఆర్ అండ్ బి డివిజన్ల వారిగా వివరాలు ఎప్పటికప్పుడు నాకు తెలపాలి
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్:**

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావ రణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ ఆర్ అండ్ బి అధికారులను అలెర్ట్ చేశారు. సి.ఈ నుండి ఏ.ఈ వరకు,పై స్థాయి నుండి కింద స్థాయి వరకు గల ఆర్ అండ్ బి ఇంజనీర్లు అందరు క్షేత్ర స్థాయిలో ఉండాలనీ తేల్చి చెప్పారు. భారీ వర్షాల వల్ల..వరదలతో ముందుగా ఇబ్బందిగా మారే రోడ్లు,బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలనీ,ప్రజ లను అప్రమత్తం చేయాలని అన్నారు. రోడ్లు కోతకు గురైతే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ,పోలీసు,ఎలక్ట్రిసి టీ,ఇరిగేషన్ ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలనీ సూచించారు. శని,ఆదివారా లు అని సెలవులు ఏమి లేవనీ...అత్యవసరం అయితే తప్పా అందరు ఫీల్డ్ లో ఉండాల్సిందే నని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎర్రమంజి ల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు,బ్రిడ్జిల పరిస్థితి మానిటరింగ్ చేయాలనీ,రాష్ట్రంలోని అన్ని ఆర్ అండ్ బి డివిజన్ల వారిగా వివరాలు ఎప్పటికప్పుడు తనకు తెలపాలనీ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.



# నల్లగొండ మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి 17న పర్యటన

**హైదరాబాద్:**

బహిరంగ సభ స్థలాన్ని,హ్యాం రోడ్ల పైలాన్, హెలీప్యాడ్ స్థలాల ఏర్పాట్లు పరిశీలించిన రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ,రాష్ట్రంలో రూ.14,000 కోట్ల వ్యయంతో హ్యాం పద్ధతిలో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కనగల్ మండలం నుంచి శంకుస్థాపన చేయనున్న ట్లు తెలిపారు..

రాష్ట్రవ్యాప్తంగా 34 ప్యాకేజీలుగా 6,300 కిలోమీటర్ల రహదారులను డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ రవాణా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు.. మెరుగైన రహదారులు పరిశ్రమల అభివృద్ధికి,వ్యవసాయ పురోగ తికి,రోడ్డు భద్రతకు దోహదపడతాయని పేర్కొన్నారు.. లక్ష మందికి పైగా ప్రజలు హాజరుకానున్న ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ,స భకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు..



# చెట్టు కొమ్మ తొలగిస్తుండగా విషాదం

**హైదరాబాద్, జూన్ 13:**

భారీ వర్షం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కారుపై పడిన చెట్టు కొమ్మలను తొలగించే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురై తండ్రీకూతుళ్లు ప్రాణాలు కోల్పోయిన ఘటన అల్వాల్‌లో చోటుచేసుకుంది. ఒకే కుటుంబంలో ఇద్దరు సభ్యులు మృతిచెంద డంతో టెలికాం కాలనీ ప్రాంతం విషాదంలో మునిగిపోయింది. స్థానికుల కథనం ప్రకారం, శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఓ పెద్ద చెట్టు విరిగి సందీప్ కుటుంబానికి చెందిన కారుపై పడింది. ఉదయం కారును బయటకు తీసేందుకు చెట్టు కొమ్మలను తొల గించాలని సందీప్ తన కుమార్తె రితికతో కలిసి ప్రయత్నించారు. ఈ క్రమంలో చెట్టు కొమ్మలు సమీపంలోని విద్యుత్ తీగలకు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించింది. ప్రమాదా న్ని గుర్తించేలోపే సందీప్, రితిక తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వారిని కాపాడేందుకు పరుగెత్తుకొచ్చిన సందీప్ భార్య శ్వేతకు కూడా గాయాలయ్యాయి. అయితే సందీప్, రితికలను రక్షించలేకపోయారు.

**చదువుల్లో రాణిస్తున్న రితిక**

మృతురాలు రితిక ఇంటర్మీడియట్ చదువు తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భవి ష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కుమార్తెను, కుటుంబానికి అండగా ఉన్న తండ్రిని ఒకేసారి కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీ రుగా విలపిస్తోంది. రితిక మృతి వార్త తెలిసిన సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**వర్షం తెచ్చిన విషాదం**

ఒకరినొకరు కాపాడుకునే ప్రయత్నంలో తం డ్రీకూతుళ్లు ప్రాణాలు కోల్పోవడం స్థానికుల ను కలచివేసింది. నిన్నటి వరకు ఆనందంగా ఉన్న కుటుంబం క్షణాల్లో శోకసంద్రంలో ము నిగిపోయిందని పొరుగువారు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు

- ముడిచమురు సరఫరాలో అంతరాయం
- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం




**న్యూఢిల్లీ, జూన్ 12:** పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది. పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉ ంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

# హనీట్రాప్‌లో మోసపోయిన మహిళా న్యాయమూర్తి

## పనివాళ్లతో ఫిర్యాదుతో బయటపడ్డ వైనం



**చండీఘడ్, జూన్ 12:** హనీట్రాప్‌లో పడి.. ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. అభిమన్యు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు విచారణ సందర్భంగా లావాదేవీలు సహాయకురాలి బ్యాంకు నుంచి కాకుండా.. న్యాయమూర్తి ఖాతాల నుంచి జరిగాయని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ గుర్తించారు. అలాగే దర్యాప్తులో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు, న్యాయమూర్తికి సంబంధించిన పూర్తి వాట్సప్ సంభాషణలను, కాల్ రికార్డులు సేకరించలేదని తెలిపారు. దర్యాప్తు అసంపూర్తిగా ఉన్నందున.. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉందని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. టిండర్ యాప్, వాట్సప్‌లలో ఇరువురి మధ్య జరిగిన పూర్తి సంభాషణలను సేకరించాలని ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. నిధుల బదిలీకి వివరాలు.. నిందితుడి ఫోన్‌కి సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణను తొందరగా నిర్వహించాలని పేర్కొంది.

# ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

## ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



**న్యూఢిల్లీ, జూన్ 12:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కోనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి



**న్యూఢిల్లీ,జూన్12:** పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

# రోజుకు రెండు ఖర్జూరాలు..



డ్రై ఫ్రూట్స్‌లో కూడా ఒకటి. ఖర్జూరంలో ఉండే పోషకాలు అన్నీ ఇన్నీ కావు. మనిషి శరీరానికి కావాల్సినన్ని విటమిన్లు, మినరల్స్ ఖర్జూరంలో లభిస్తాయి. ప్రతి రోజూ రెండు ఖర్జూరాలు తింటే ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. అంతే కాకుండా అనారోగ్య సమస్యలు కూడా దరి చేరవు. ముఖ్యంగా బాడీలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఖర్జూరాల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి పచ్చివి. రెండోది ఎండిన ఖర్జూరాలు. ఎండిన ఖర్జూరాలను రాత్రంతా నానబెట్టి ఉదయం తింటే ఇంకా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఖర్జూరాలతో కేవలం ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా చర్మం, జుట్టు సమస్యల్ని కూడా తగ్గించుకోవచ్చు. అయితే ఇవి కేవలం సీజనల్ వారీగానే లభ్యమవుతాయి. కానీ వీటిని ప్రిజర్వేట్ చేసి అన్ని కాలాల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్యంగా చలికాలంలో వీటిని తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఖర్జూరంలో విటమిన్లు, పొటాషియం, కాల్షియం, ఖనిజాలు, ఫైబర్, పాస్ఫరస్, కాపర్, మెగ్నీషియం పుష్కలంగా లభిస్తాయి.

### గుండె ఆరోగ్యానికి భరోసా..

గుండె ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. వీటిలో ఉండే మెగ్నీషియం, పొటాషియం.. రక్తపోటును తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అందాన్ని రెట్టింపు చేయడంలోనూ ఖర్జూరాలు ముందుంటాయి. వీటిని రోజుకు రెండు చొప్పున తింటే.. చర్మం కాంతిమంతంగా తయారవుతుంది. ఖర్జూరలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు.. చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి.రక్తహీనతకు ఖర్జూరాలు విరుగుడులా పనిచేస్తాయి. ఇవి శరీరంలో ఇనుమును పెంచి.. రక్తహీనతను దూరం చేస్తాయి.ఖర్జూరలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి, ఇతర యాంటి ఆక్సిడెంట్లు.. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.మలబద్ధకం సమస్యను నివారించడంలో ఖర్జూరం సమర్థంగా పనిచేస్తుంది. దీనిలో ఉండే ఫైబర్.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.ఖర్జూరలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, పాస్ఫరస్.. ఎముకల దృఢత్వాన్ని పెంచుతాయి.

**రక్త హీనత కంట్రోల్:** రోజూ రెండు ఖర్జూరాలను తినడం వల్ల రక్త హీనత సమస్య అదుపులోకి వస్తుంది. ఖర్జూరాల్లో ఐరన్ కంటెంట్, విటమిన్ సి మెండుగా లభ్యమవుతాయి కాబట్టి.. వీటిని తింటే రక్త హీనత లోపం నుంచి బయట పడొచ్చు. నానబెట్టిన ఖర్జూరాలైనా తినొచ్చు. ఖర్జూరాల్లో మెగ్నీషియం, పొటాషియం వంటివి పుష్కలంగా లభిస్తాయి. ఇవి రక్త పోటును నియంత్రించడానికి బాగా సహాయ పడుతుంది. అంతే కాకుండా కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి, గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగు పరుస్తుంది.

**బ్రెయిన్ హెల్త్:** ఖర్జూరాల్లో మెగ్నీషియం, విటమిన్ బి6 పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడులోని ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. అదే విధంగా తెలివి తేటలను కూడా పెంచుతాయి. ఖర్జూరాలు తింటే బ్రెయిన్ యాక్టీవ్‌గా ఉంటుంది. పిల్లలకు ఇవ్వడం చాలా మంచిది.ఖర్జూరాల్లో ఫాస్పరస్, క్యాల్షియం, మెగ్నీషియం లభిస్తాయి కనుక.. వీటిని తింటే ఎముకులు బలంగా, దృఢంగా ఉంటాయి. అంతే కాకుండా ఎముకలకు వచ్చే సమస్యలు కూడా తగ్గుతాయి.

**చర్మం, జుట్టు ఆరోగ్యం:**ప్రతి రోజూ ఖర్జూరాలను తినడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు జుట్టు రాలకుండా, చర్మం అందంగా మెరిసేలా చేస్తుంది

# నాలుకపై మచ్చలు అదృష్టం కాదు

నాలుకపై నల్లటి మచ్చలు కనిపిస్తే అదృష్టమని, వారు ఏదైనా చెబితే చాలా వరకు నిజం అవుతుందని కొందరు నమ్ముతుంటారు. కానీ ఇది కేవలం మూఢ నమ్మకం మాత్రమే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. నాలుకపై నల్లటి, తెల్లటి, ఎర్రటి రంగుల్లో ఏర్పడే మచ్చలు వాస్తవానికి శరీరంలో ప్రారంభమయ్యే కొన్ని రకాల వ్యాధుల లక్షణాలు కూడా కావచ్చునని చెబుతున్నారు. ముఖ్యంగా ల్యూకోప్లాకియా లేదా ఓరల్ థ్రష్, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రారంభం లక్షణాల్లో నాలుకపై మచ్చలు ఏర్పడే అవకాశం ఉందని అంటున్నారు. కాఫీ లేదా రెడ్ వైన్ వంటి కొన్ని ఆహారాలు లేదా పానీయాలు తీసుకోవడం వంటి హానిచేయని కారణాల వల్ల అవి సంభవించవచ్చు, అయితే నల్ల మచ్చలు కొన్నిసార్లు అంతర్లీన ఆరోగ్య సమస్యలను సూచిస్తాయి.



### ల్యుకోప్లాకియా వ్యాధి

కేవలం మచ్చలే కాకుండా నాలుక ఆధారంగా పలు రోగాలను గుర్తింవచ్చునని వైద్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా నల్లటి, తెల్లటి మచ్చలు మచ్చలు కనిపించడం, క్రీమ్ వంటి తెల్లటి పదార్థం నాలుకపై ఉత్పత్తి అవుతుండటం అనుమానించ దగినవివే. ఎందుకంటే ఇవి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నప్పుడు సంభవించే లక్షణాలని పేర్కొంటున్నారు. అట్లనే కొన్నిసార్లు ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వల్ల కూడా నాలుకపై తెల్లటి మచ్చలు ఏర్పడవచ్చు. నల్లటి మచ్చలు ఏర్పడి క్రీమ్ వంటి పదార్థం ఎక్కువగా కనిపిస్తే అది ల్యుకోప్లాకియా వ్యాధికి దారితీస్తుందని, క్రమంగా క్యాన్సర్‌గా మారే అవకాశం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి నాలుకపై అనుమానాస్పద మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం. మానవ నాలుక అనేది పాపిల్లె అని పిలువబడే చిన్న గడ్డలతో కప్పబడిన ఒక ఆకర్షణీయమైన కండరం, ఇది మన రుచి మొగ్గలను కలిగి ఉంటుంది. ఈ ఇంద్రియ అవయవాలు మనకు వివిధ రకాల రుచులను ఆస్వాదించడానికి అనుమతిస్తాయి. అప్పుడప్పుడు, ఈ పాపిల్లె చనిపోయిన చర్మ కణాలు, శిధిలాలు లేదా ఆహార రంగులను బంధించి, నల్ల మచ్చల రూపాన్ని సృష్టిస్తాయి. నిరపాయకరమైన తాత్కాలిక భాషా పాపిలిటిస్ లేదా "వెంట్రుకల నాలుక" అని పిలువబడే ఈ పరిస్థితి సాధారణంగా హానిచేయనిది. మీ నాలుకను సున్నితంగా బ్రష్ చేయడంతో సహా మంచి నోటి పరిశుభ్రత సాధారణంగా దానిని క్లియర్ చేస్తుంది.

### ఫోలిక్ యాసిడ్ లోపం

ఫోలిక్ ఆమ్లం లేదా విటమిన్ బీ9, కణాల పెరుగుదల మరియు డీఎన్ఏ సంశ్లేషణకు ముఖ్యమైనది. ఫోలిక్ ఆ లోపం వల్ల నోటిలో గ్లోసిటిస్ మరియు నాలుక రంగులో మార్పులు వంటివి వస్తాయి. నాలుక ఉపరితల ఉండే ఎపిథీలియల్ కణాలలో మార్పుల వల్ల నల్ల మచ్చలు ఏర్పడవచ్చు.

### ఆహార మార్పులు

విటమిన్ బి12, ఐరన్ మరియు ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీ కోవడం ద్వారా మీ ఆహారాన్ని మెరుగుపరచుకోవడం వల్ల లోపాలను పరిష్కరించ లో మరియు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. లీన్ మీ చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, చిక్కుళ్ళు మరియు బలవర్ధక తృణధాన్యాలు వంటి వనరులను మీ ఆహారంలో చేర్చుకోండి.

### సప్లిమెంట్స్

తీవ్రమైన లోపాల సందర్భాలలో లేదా ఆహారంలో మార్పులు సరిపోకపోతే మెంట్లను సిఫార్సు చేయవచ్చు. మీ అవసరాలకు తగిన మోతాదు మరి సప్లిమెంట్ల రకాన్ని నిర్ణయించడానికి ఆరోగ్య సంరక్షణ నిపుణుడిని లే నమోదిత డైటీషియన్‌ను సంప్రదించండి.

### పర్యవేక్షణ అవసరం

మీ నాలుకలో నల్ల మచ్చలు లేదా ఏవైనా మార్పులు కనిపిస్తే, క్షుణ్ణ మూల్యాంకనం కోసం దంతవైద్యుడు లేదా ఆరోగ్య సంరక్షణ ప్రదాతను ప్రదించండి. వారు మీ నోటి ఆరోగ్యాన్ని అంచనా వేయగలరు, ఏవైనా అంత లోపాలు లేదా పరిస్థితులను గుర్తించగలరు మరియు తగిన చికిత్సను సిఫా చేయగలరు.

### నోటి పరిశుభ్రత పద్ధతులు

నాలుక ఆరోగ్యంతో సహా మొత్తం నోటి ఆరోగ్యానికి మంచి నోటి పరిశుభ్రతను కా డుకోవడం చాలా ముఖ్యం. రోజుకు రెండుసార్లు మీ దంతాలను బ్రష్ చేయండి, నాలుక స్క్రాపర్ లేదా టూత్ బ్రష్‌తో శుభ్రం చేయండి మరియు నాలుక రంగు మారడానికి దోహద ఫలకం మరియు బ్యాక్టీరియాను తొలగించడానికి క్రమం తప్పకుండా ఫ్లాస్ చేయండి.

### వైద్య చికిత్స

కొన్నిసార్లు, నాలుకపై నల్ల మచ్చలు అంతర్లీన వైద్య పరిస్థితుల వల్ల లేదా మందుల వల్ల సంభవించవచ్చు. లోపా తోసిపుచ్చబడితే లేదా పరిష్కరించబడితే మరియు నల్ల మచ్చలు కొనసాగితే, మరింత మూల్యాంక మరియు చికిత్స అవసరం కావచ్చు.

### విటమిన్ బి12 లోపం

ఎర్ర రక్త కణాల నిర్మాణం, నరాల పనితీరు మరియు డీఎన్ఏ సంశ్లేషణకు విటమిన్ డీ12 చాలా ముఖ్యమైనది. ఈ విటమిన్ లోపం వల్ల నోటి సమస్యలు వస్తాయి, వాటిలో గ్లాసిటిస్ (నాలుక వాపు) మరియు నాలుక రంగు మారడం వంటివి ఉంటాయి. నాలుక ఉపరితలంపై ఉన్న పాపిల్లేలో మార్పుల కారణంగా నల్ల మచ్చలు కనిపించవచ్చు.

### ఇనుము లోపం

శరీరంలో ఆక్సిజన్ రవాణాకు మరియు నాలుకతో సహా ఆరోగ్యకరమైన కణజాలాలను నిర్వహించడానికి ఇనుము చాలా అవసరం. ఇనుము లోపం, లేదా ఇనుము లోపం అనీమియా, నాలుక యొక్క రూపంలో మార్పులకు కారణమవుతుంది, ఉదాహరణకు నల్ల మచ్చలు లేదా కణజాలం నల్లబడటం. ఈ పరిస్థితి గ్లోసిటిస్ మరియు ఇతర నోటి లక్షణాలకు కూడా దారితీయవచ్చు.




# ఆ నంబర్‌తో మెసేజ్‌లు వస్తే దయచేసి నమ్మొద్దు..



ప్రస్తుత రోజుల్లో సెలబ్రిటీల పేర్లను వాడుకుని అమాయక ప్రజలను మోసం చేసే కేటుగాళ్ల సంఖ్య బాగా పెరిగిపోయింది. ఇప్పటికే ఎంతోమంది హీరో, హీరోయిన్ల ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేసి భారీగా డబ్బులు వసూలు చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయాన్ని కొందరు తాజాగా, ఈ సైబర్ నేరగాళ్ల బారిన టాలీవుడ్ లక్కీ బ్యూటీ మీనాక్షి చౌదరి పడింది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె పేరుతో ఒక ఫేక్ వాట్సాప్ నంబర్‌ను క్రియేట్ చేసి, కొందరికి మెసేజ్‌లు పంపుతూ డబ్బులు అడుగుతున్నట్లు ఆమె దృష్టికి వచ్చింది. ఈ మోసం గురించి తెలుసుకున్న మీనాక్షి చౌదరి వెంటనే అప్రమత్తమై తన అభిమానులను అలర్ట్ చేసింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెడుతూ.. "నా పేరుతో ఫేక్ నంబర్ ఉపయోగించి కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కాబట్టి నా అభిమానులు, నెటిజన్లు ఎవరూ వారిని నమ్మి మోసపోవద్దు. ముఖ్యంగా 7604891175 అనే నంబర్ నుండి మీకు ఎలాంటి మెసేజ్‌లు లేదా కాల్స్ వచ్చినా వెంటనే స్పందించకండి. ఆ నంబర్ నాది కాదు. ఒకవేళ ఆ నంబర్ నుండి మీకు మెసేజ్ వస్తే దయచేసి నాకు తెలియజేయండి. ఈ సమాచారాన్ని ఇతరులతో పంచుకున్న వారందరికీ ధన్యవాదాలు" అని రాసుకొచ్చింది. మీనాక్షి స్వయంగా స్పందించడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం మీనాక్షి పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇండస్ట్రీలోని అసలైన స్టార్‌డమ్ గురించి చెబుతూ.. "సినిమా పరిశ్రమలో కొంతమంది నటులకు సోషల్ మీడియాలో కేవలం 5 మిలియన్ల మంది ఫాలోవర్లు మాత్రమే ఉంటారు. కానీ థియేటర్లలో వారి సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉంటుంది.

కోలీవుడ్ యంగ్ బ్యూటీ మాళవిక వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ స్టార్ హీరోల సరసన లక్కీ చాన్స్ కొట్టేస్తున్నారు. ఇటీవల 'ది రాజాసాబ్' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం విలక్షణ దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా దర్శకత్వంలో రాబోతున్న 'పాకెట్ నోవెల్' మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వచ్చిన 'సూపర్ డీలక్స్' వంటి కల్ట్ క్లాసిక్ హిట్ తర్వాత విజయ్ సేతుపతి, దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది కావడంతో ప్రకటన రోజు నుంచే అందరిలోనూ ఆసక్తి మొదలైంది.

టైలర్ డర్డెన్ అండ్ కింగ్ ఫిస్ట్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని, షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. తాజాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్‌లో హీరోయిన్ మాళవిక మోహనన్ కూడా అడుగుపెట్టింది. ఈ విషయాన్ని మాళవిక ట్విట్టర్ ద్వారా వెల్లడించింది. షూటింగ్ సెట్స్‌లో దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజాతో కలిసి దిగిన ఒక ఆసక్తికరమైన ఫొటోను షేర్ చేసింది. ఎంతో ప్రతిభావంతుడైన దర్శకుడితో కలిసి పని చేయడం సంతోషంగా ఉందంటూ పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా సంగీతం అందిస్తుండగా.. కన్నడ స్టార్ రాజ్ బి. శెట్టి విలన్ పాత్రలో నటిస్తున్నారు.



'పాకెట్ నోవెల్' సినిమా షూటింగ్‌లో జాయిన్ అయిన మాళవిక మోహనన్..



# మరోసారి వాయిదా పడిన లెనిన్.. కొత్త రిలీజ్ డేట్ ప్రకటించిన నాగార్జున

అక్కినేని ఫ్యాన్స్‌ను నిరాశపర్చుతూ 'లెనిన్' మరోసారి వాయిదా పడింది. అక్కినేని హీరో అఖిల్, యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అఖిల్ కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోండగా.. అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఈ మూవీ మాత్రం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే వస్తుంది. ఎన్నో వాయిదాల తర్వాత జూన్ 26న రిలీజ్‌కు సిద్ధమైన ఈ చిత్రం మరోసారి వాయిదా పడినట్లు గతకొద్ది రోజులుగా వార్తలు రాగా.. ఫైనల్‌గా వాయిదాపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఈ మేరకు అక్కినేని నాగర్జున సోషల్ మీడియాలో వేదికగా ప్రకటిస్తూ.. ''టీమ్ లెనిన్' నా దగ్గరకు ఒక అభ్యర్థనతో వచ్చింది. తమ వంతుగా 100% కృషి చేసి, ఇంకొంచెం బెటర్‌గా రూపొందించడానికి వారు మరికొంత సమయం అడిగారు. వారి అంకితభావం, ఉత్సాహం చూసి నేను సరేనన్నాను. జులై 10న 'మనోడు' రాబోతున్నాడు. మరోసారి చెబుతున్నాను, మీరు ఒక కొత్త అఖిల్‌ను చూడబోతున్నారు.. లెనిన్ అనుభూతి కోసం సిద్ధంగా ఉండండి' అంటూ తెలిపాడు.




# నాగార్జున ఆ సినిమాను లైట్ తీసుకున్నాడా?

టాలీవుడ్ కింగ్ నాగార్జున కొన్ని సంవత్సరాల క్రితం 'సోగ్గాడే చిన్నినాయనా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీలో రమ్యకృష్ణ, లావణ్య త్రిపాఠి హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా 2016 సంక్రాంతి కానుకగా విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఈ చిత్రానికి కొనసాగింపుగా నాగార్జున, నాగచైతన్య హీరోలుగా, రమ్యకృష్ణ, కృతి శెట్టి హీరోయిన్లుగా కళ్యాణ్ కృష్ణ 'బంగార్రాజు' చిత్రాన్ని తెరకెక్కించాడు. ఈ మూవీ 2022 సంక్రాంతి సందర్భంగా విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ఇక 'సోగ్గాడే చిన్నినాయనా', 'బంగార్రాజు' చిత్రాలకు సీక్వెల్‌గా మరో సినిమాను రూపొందించనున్నట్లు, దానికి కూడా కళ్యాణ్ కృష్ణ దర్శకత్వం వహించనున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి గతంలో ప్రకటన వెలువడింది.

అలాగే ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని వార్తలు వినిపించాయి. అయితే ఇప్పటికే ఈ ఏడాది సగం పూర్తవగా, సంక్రాంతికి కూడా ఎక్కువ సమయం లేకపోయినా ఇప్పటివరకు నాగార్జున – కళ్యాణ్ కృష్ణ కాంబినేషన్ మూవీ షూటింగ్ ప్రారంభం కాలేదు. ప్రస్తుతం నాగార్జున, రా కార్తీక్ దర్శకత్వంలో రూపొందుతున్న తన 100వ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఈ ప్రాజెక్ట్‌పైనే ఆయన పూర్తి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దాంతో కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న సినిమాను ప్రస్తుతానికి నాగార్జున పక్కన పెట్టినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# 'ఓ సుకుమారి' టీజర్ విడుదల.. సర్‌ప్రైజులు, షాకింగ్ ట్విస్ట్‌లతో హైప్ క్రియేట్!




టాలీవుడ్ యంగ్ హీరో తిరువీర్, ఐశ్వర్య రాజేష్ కాంబోలో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఓ..!సుకుమారి'. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని మహేశ్వర రెడ్డి మాలి నిర్మిస్తున్నారు. భరత్ దర్శన్ ఈ సినిమా ద్వారా ఇండస్ట్రీకి దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈక్రమంలో.. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన టీజర్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. టీజర్ చూస్తుంటే ఈ సినిమా అందమైన గ్రామీణ నేపథ్యంలో సరికొత్తగా, ఎంతో ఆహ్లాదకరంగా సాగనున్నట్లు స్పష్టమవుతోంది. ఒక సున్నితమైన, మధురమైన ప్రేమకథతో పాటు కథలో ఆశ్చర్యపరిచే మలుపులు కూడా ఉన్నట్లు మేకర్స్ చూపించారు. ఇందులో తిరువీర్ పల్లెటూరి రాజకీయాల్లో పాల్గొనే యాదగిరి అనే యువకుడిగా కనిపించగా.. ఐశ్వర్య రాజేష్ పక్కా మాస్ పల్లెటూరి అమ్మాయి దామిని పాత్రలో కనిపించి మెప్పించింది.

తనదైన చురుకుదనం, అల్లరి మాటలతో ఊరి జనాన్ని ఇబ్బంది పెట్టే పాత్రలో ఆమె నటన ఆకట్టుకుంది. కథ విషయానికి వస్తే.. ఊరిలో అందరినీ ఆటపట్టించే ఐశ్వర్య రాజేష్‌ను అమితంగా ఆరాధించే తిరువీర్, ఆమెను తనతో పాటు పాలిటిక్స్‌లోకి తీసుకువస్తాడు. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య ప్రేమ చిగురించి, అది పెళ్లికి దారితీస్తుంది. వివాహం తర్వాత వారిద్దరూ రాజకీయాల్లో విజయం సాధించారా? అసలు ఊరి ప్రజలు వీరిద్దరిని ఎందుకు తరుముతున్నారు? వీరి జీవితాల్లో ఎలాంటి ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమా రాబోతుంది. ఇక ఇందులో సర్‌ప్రైజులు షాకింగ్ ట్విస్ట్‌లు కూడా ఉండనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతున్న ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని అన్ని పాటలకు సాహిత్యం అందించడం విశేషం.

# నా కథని సినిమాగా తీయాలంటే.. రెండు భాగాలుగా తీయాలి!



"అందర్నీ షాక్‌కి గురి చేసే సినిమా 'రావు బహదూర్'" అన్నారు సత్యదేవ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని వెంకటేశ్ మహా తెరకెక్కించారు. మహేశ్‌బాబు - నమ్రత శిరోద్కర్ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించారు. దీపా థామస్ కథానాయిక. ఈ సినిమా జులై 3న రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో టీజర్‌ను విడుదల చేశారు. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇదొక సైకలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్‌గా ముస్తాబైనట్లు అర్థమవుతోంది. "నా కథ గానీ సినిమాగా తీయాలంటే.. కనీసం రెండు భాగాలుగా తీయాలి తెలుసా" అంటూ ఆఖర్లో సత్య చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. అనంతరం హీరో సత్యదేవ్ మాట్లాడుతూ.. "ఈ ఏడాదిలోని అన్ని శుక్రవారాల కంటే ఈ సినిమా వచ్చే శుక్రవారం పూర్తి భిన్నంగా ఉండనుంది" అన్నారు.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in